# కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలి



**ఉద్యమ కెరటం, బజార్హత్నూర్:** ప్రతిపక్ష నాయకుడిగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం బజార్హత్నూర్ మండల కేంద్రంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ జాదవ్తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి సానుకూల సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన బాధ్యతను కేసీఆర్ విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్ళెం విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, జెల్కే పాండురంగ్, రాథోడ్ రమేష్, బొమ్మెత నర్సయ్య, మునేశ్వర్ నారాయణ, దీసి విజేందర్, గొల్లనాగు రమేష్, సురేష్రెడ్డి, నారాయణ, రజాక్, కృష్ణకాంత్రెడ్డి, సయ్యద్ సల్మాన్తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తండా వాసుల తాగునీటి కష్టాలకు చెక్





**ఉద్యమ కెరటం, కెరమెరి:** మండలంలోని పరందోలీ గ్రామ పంచాయతీ పరిధిలోని తండా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. తండా వాసులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడిని గుర్తించిన సర్పంచ్ పుష్పలతా రాథోడ్ ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామంలో శుక్రవారం నూతన బోర్వెల్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి బోర్ వేయించారు. తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి తక్షణమే స్పందించి బోర్వెల్ వేయించారు. దీంతో తండా వాసుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల మౌలిక అవసరాల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న సర్పంచ్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోల్మామడ టోల్ప్లాజా సిబ్బందిపై హత్యాయత్నం

- ఆరుగురు అంతరాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్




**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రోల్మామడ టోల్ప్లాజా వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపైకి ఉద్దేశపూర్వకంగా వాహనాలు ఎక్కించి హత్యాయత్నానికి పాల్పడిన అంతరాష్ట్ర పశువుల అక్రమ రవాణా ముఠాకు చెందిన ఆరుగురు నిందితులను నేరడిగొండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్.రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 1న ఉదయం నేరడిగొండ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న మహీంద్రా బొలెరో ఎస్యూవీ వాహనాన్ని టోల్ సిబ్బంది నిలిపేందుకు ప్రయత్నించగా, నిందితులు గేట్లను ఢీకొంటూ అత్యంత వేగంగా ముందుకు దూసుకెళ్లారు. ఆ వెంటనే వెనుక వస్తున్న కంటైనర్ లారీ కూడా టోల్ సిబ్బంది ఏర్పాటు చేసిన సైన్ కోన్లు, డివైడర్లను ఢీకొట్టి పరారైంది. ఈ ఘటనపై టోల్ప్లాజా సూపర్వైజర్ యెంపల్లి రామయ్య ఫిర్యాదు మేరకు నేరడిగొండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా గురువారం తెల్లవారు జామున కుంటాల గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వెల్లడైన సమాచారంతో ఆదిలాబాద్లో ఉన్న మిగిలిన ఇద్దరు నిందితులను కూడా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఎండి.షఫీ ముదస్సిర్, గోపాల్ సింగ్ షెకావత్ ఇద్దరు ఆదిలాబాద్లోని తాటిగూడకు చెందినవారు కాగా, ఫిర్దోస్ బేగ్, మహమ్మద్ హైదర్ అలీ, క్షితిజ్ భీమ్రావు సేవట్కర్ మహారాష్ట్ర నాగ్పూర్ కు చెందినవారు, సందీప్ విఠల్ ముప్పిడివార్ యవత్మాల్, మహారాష్ట్రకు చెందినవాడు. ఈ కేసులో పరారీలో ఉన్న మహమ్మద్ మజార్, రాజు, రవి జగదీష్ బాగ్డేల్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నిందితులు ఒక ముఠాగా ఏర్పడి మహారాష్ట్రలోని నాగ్పూర్ ప్రాంతం నుంచి పశువులను అక్రమంగా రవాణా చేస్తూ నిజామాబాద్ జిల్లా సతాపూర్ వైపు తరలిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. పశువులను తరలిస్తున్న కంటైనర్ లారీకి ముందు బొలెరో ఎస్యూవీని పైలట్ వాహనంగా వినియోగిస్తూ పోలీసుల తనిఖీలకు సంబంధించిన సమాచారాన్ని లారీ డ్రైవర్కు చేరవేస్తున్నారు. రోల్మామడ టోల్ప్లాజా వద్ద సిబ్బంది వాహనాలను అడ్డుకునేందుకు ప్రయత్నించగా నిందితులు ఉద్దేశపూర్వకంగా వాహ నాలను సిబ్బందిపైకి ఎక్కించి ప్రాణాపాయం కలిగించేలా వ్యవహరించారు. నిందితుల వద్ద నుంచి 47 పశువులు అందులో 24 ఎద్దులు, 23 ఆవులు, ఒక కంటైనర్ లారీ, ఏ3 నిందితుడి వద్ద నుంచి 4 గ్రాముల గంజాయి, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా కారణంగా 3 పశువులు మృతి చెందగా మిగిలిన 44 పశువులను గోశాలకు తరలించారు. నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అరెస్టయిన నిందితులను బోథ్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చి రిమాండ్కు తరలించారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర మంత్రి సీతక్క
- సత్తుపల్లిలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ
- వంద మంది మహిళలకు కుట్టు మిషన్ల అందజేత



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సిద్ధారం రోడ్డులో ఉన్న ఎమ్మార్ గార్డెన్స్ ఫంక్షన్హాల్లో జరిగిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథులుగా హాజరై మహిళా లబ్ధిదారులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిందని, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, రైతులు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సహకారంతో వంద మంది మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను అందజేశారు. ప్రజల తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్రెడ్డికి ఎమ్మెల్యే రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, సోషల్ మీడియా ప్రతినిధులు, అంగన్వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఆగ్రహం





- రోడ్డుపైనే వంటావార్పు చేసి బీఆర్ఎస్ నిరసన

**ఉద్యమ కెరటం, సిర్పూర్(యు):** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసనల్లో భాగంగా శుక్రవారం సిర్పూర్(యు) మండల కేంద్రంలోని చౌరస్తాలో రోడ్డుపై వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మరావు, జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్రావు ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్రంగా మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను కొనసాగించకుండా నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపైనే వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, స్థానిక సర్పంచ్ ఆత్రం ఓంప్రకాశ్, కోహినూర్ సర్పంచ్ సిడాం విజయ, నెట్నూర్ మాజీ సర్పంచ్ అర్క నాగోరావు, మడవి బజ్జీరావు, కోవ నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాయిపల్లి ప్రభుత్వ పాఠశాలకు రూ.45 వేల విలువైన డ్యూయల్ డెస్క్ బెంచీల వితరణ

**ఉద్యమ కెరటం,రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీ రేకులపల్లి కార్తికేయ, మల్లారెడ్డి కుమారుడు, తన నానమ్మ, తాతయ్యల జ్ఞాపకార్థం రూ.45 వేల విలువైన 15 డ్యూయల్ డెస్క్ బెంచీలను పాఠశాలకు వితరణ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నిమ్మ భాగ్యలక్ష్మి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమానికి సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పాఠశాలకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. "విద్యాదానం మహాదానం" అని అన్నారు. మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వ పాఠశాలకు డ్యూయల్ డెస్క్ బెంచీలు అందించిన రేకులపల్లి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "విద్యార్థుల సంఖ్యను పెంచే బాధ్యత మీది.. పాఠశాలను అభివృద్ధి చేసే బాధ్యత మాది" అని అన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజలు, తల్లి దండ్రులు సహకరించాలని కోరారు.రేకులపల్లి కార్తికేయ కుటుంబం తరపున కార్యక్రమానికి హాజరైన రేకులపల్లి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలకు డ్యూయల్ డెస్క్ బెంచీలు అందించడంతో పాటు భవిష్యత్తులో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని తెలిపారు.పాఠశాల హెచ్ఎం గిరిజా మాట్లాడుతూ.. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తరపున డ్యూయల్ డెస్క్ బెంచీలు వితరణ చేసిన రేకులపల్లి కార్తికేయ, ఆయన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మనోహర్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, తిరుపతి, లక్ష్మి, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

